సాక్షి ఆదిలాబాద్



నాగోబాకు పోటెత్తిన భక్తజనం

నాగోబా జాతర కొనసాగుతోంది. భక్తులు బుధవారం భారీగా తరలివచ్చారు. గంటల తరబడి క్యూలో నిల్చొని నాగోబాను దర్శించున్నారు. 10లో ▸



'కిసాన్ వాణి'కి 20 ఏళ్లు 8లో ▸

ఆకాశవాణి కర్షకులకు సాగులో విలువైన సమాచారాన్ని రెండు దశాబ్దాలుగా అందస్తోంది. కిసాన్ వాణి కార్యక్రమం ప్రారంభమై నేటితో 20 ఏళ్లు కావడం విశేషం.

గరిష్టం/కనిష్టం
31.0/20.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. గాలిలో తేమశాతం పెరగనుంది. పలుచోట్ల ఆకాశం మేఘావృతమై ఉంటుంది.

న్యూస్‌రీల్

మున్సిపల్ కమిషనర్‌గా ఖమర్ బాధ్యతలు



కమిషనర్‌కు పూలమొక్క అందజేస్తూ..

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ మున్సిపల్ కమిషనర్‌గా ఎండీ.ఖమర్ అహ్మద్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. కార్యాలయానికి చేరుకున్న ఆయనకు అధికారులు, ఉద్యోగులు పూల మొక్కలు అందజేసి స్వాగతం పలికారు. తన చాంబర్‌లో ఆయన బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ రాహుల్‌రాజ్‌ను కలెక్టరేట్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయన వెంట మున్సిపల్ రెవెన్యూ అధికారి జాదవ్ కృష్ణ తదితరులున్నారు.

డీసీఆర్బీ డీఎస్పీగా సురేందర్‌రెడ్డి

ఆదిలాబాద్‌టౌన్: డీఎస్పీల బదిలీల్లో భాగంగా డీసీఆర్బీ డీఎస్పీగా కే.సురేందర్ రెడ్డి నియామకం అయ్యారు. ఈయన సిద్దిపేట ఏసీపీగా పనిచేస్తున్నారు. ఇక్కడ పనిచేస్తున్న శ్రీనివాస్‌జి హుజూరాబాద్‌కు బదిలీ అయిన విషయం తెలిసిందే. త్వరలో సురేందర్ రెడ్డి బాధ్యతలు చేపట్టనున్నారు.

మున్సిపల్ సర్వసభ్య సమావేశం వాయిదా

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ మున్సిపల్ సర్వసభ్య సమావేశం వాయిదా పడింది. మంగళవారం ఉదయం 10.30గంటలకు సమావేశం నిర్వహిస్తున్నట్లు ముందుగా ప్రకటించడంతో కౌన్సిలర్లు, అధికారులు నూతన కార్యాలయ సమావేశ మందిరానికి హాజరయ్యారు. అయితే అసెంబ్లీ సమావేశాలు ఉన్న నేపథ్యంలో సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు చైర్మన్ జోగు ప్రేమేందర్ ప్రకటించారు. దీంతో పలువురు కౌన్సిలర్లు అసంతృప్తి వ్యక్తం చేశారు. ముందుగా సమాచారం ఇచ్చి ఉంటే బాగుండేదని పేర్కొన్నారు. త్వరలోనే సమావేశం నిర్వహించనున్నట్లుగా చైర్మన్ వెల్లడించారు.

30వ రోజుకు రిలే దీక్షలు

ఆదిలాబాద్: ఆదిలాబాద్–ఆర్మూర్ రైల్వేలైన్ మంజూరు చేయాలని రైల్వేలైన్ సాధన కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఆర్అండ్‌బీ విశ్రాంతి భవనం వద్ద చేపడుతున్న రిలే దీక్షలు బుధవారంతో 30వ రోజుకు చేరాయి. ఈ దీక్షలకు మహిళా సంఘర్షణ సమితి సభ్యులు సంఘీభావం ప్రకటించారు. కార్యక్రమంలో సాధన కమిటీ, సమితి సభ్యులు తదితరులున్నారు.

దేశవ్యాప్త సమ్మె విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న సాయికుమార్

ఆదిలాబాద్‌టౌన్:కేంద్రంలో అధికారంలో ఉన్న మోదీ ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలు అవలంభిస్తూ నిరుద్యోగులను పెంచి పోషిస్తుందని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సిడం సాయికుమార్, కుమ్ర అశోక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని సంఘ కార్యాలయంలో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 16న నిర్వహించనున్న దేశ వ్యాప్త సమ్మెకు పీఎల్‌వై, పీడీఎస్‌యూ జిల్లా కమిటీ సంపూర్ణ మద్దతు తెలుపుతుందని పేర్కొన్నారు.

వైభవంగా వసంత పంచమి



శిశుమందిర్‌లో సామూహిక అక్షరాభ్యాసం

ఆదిలాబాద్: జిల్లావ్యాప్తంగా బుధవారం వసంత పంచమి వేడుకలను వైభవంగా నిర్వహించారు. పలు ఆలయాల్లో భక్తుల రద్దీ కనిపించింది. జిల్లా కేంద్రంలోని హౌసింగ్‌బోర్డుకాలనీ, వినాయక్ చౌక్‌లో గల శ్రీ సరస్వతి శిశుమందిర్‌లో సామూహిక అక్షరాభ్యాసం చేపట్టారు.



అక్షరాభ్యాసం చేయిస్తున్న వేదపండితుడు

హరిత లక్ష్యం ఖరారు



నర్సరీల్లోని బ్యాగుల్లో మట్టి నింపుతున్నారిలా..

- 40 లక్షల మొక్కలు నాటేలా డీఆర్డీవో కార్యాచరణ
- సిద్ధమవుతున్న నర్సరీలు

కైలాస్‌నగర్: గ్రామాల్లో పచ్చదనం పెంపొందించడమే లక్ష్యంగా జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ (డీఆర్డీవో) ఆధ్వర్యంలో ఏటా వర్షాకాలంలో మొక్కలు నాటుతున్నారు. ఇందులో భాగంగా 2024–25కి సంబంధించిన హరితలక్ష్యాన్ని ఆ శాఖ ఖరారు చేసింది. ఈ ఏడాది గాను జిల్లా వ్యాప్తంగా 40.10లక్షల మొక్కలు నాటేలా ప్రణాళిక సిద్ధం చేశారు. ఇందుకు అవసరమైన మొక్కలు సరఫరా చేసేందుకు వీలుగా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా ప్రతీ గ్రామంలో నర్సరీలను సిద్ధం చేస్తున్నారు. విత్తనాలను నాటేందుకు వీలుగా బ్యాగుల్లో మట్టిని నింపే పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయి. జూన్ నాటికి మొక్కలను అందజేసేలా పనులు చేపడుతున్నారు.

గతేడాదితో పోల్చితే తగ్గిన లక్ష్యం

ఈ ఏడాదికి గాను జిల్లాలోని 468 గ్రామ పంచాయతీల్లో 40,10,000 మొక్కలు నాటాలని డీఆర్డీవో అధికారులు లక్ష్యంగా నిర్ణయించారు. అయితే గతేడాది పొల్చితే హరితలక్ష్యాన్ని భారీగా తగ్గించారు. గతంలో ఒక్కో మండలానికి 3లక్షల మొక్కలు నాటాలనే టార్గెట్ ఉండగా ఈ ఏడాది 2లక్షలకు తగ్గించారు. ఈ లెక్కన ఒక్కో మండలానికి లక్ష నుంచి లక్షన్నర మొక్కలను తగ్గించారు. కొన్ని మండలాల్లో గతేడాది కంటే నాటాల్సిన మొక్కలను పెంచారు. నిర్దేశిత లక్ష్యానికనుగుణంగా రానున్న జూన్, జూలై మాసాల్లో మొక్కలు నాటనున్నారు.

మండలాల వారీగా హరిత లక్ష్యం వివరాలిలా...

మండలం	గ్రామ పంచాయతీలు	నాటాల్సిన మొక్కలు
ఆదిలాబాద్‌రూరల్	34	2,34,626
బజార్‌హత్నూర్	30	2,23,405
బేల	37	2,34,117
భీంపూర్	26	1,56,177
బోథ్	33	3,12,652
గాదిగూడ	25	2,44,270
గుడిహత్నూర్	26	2,54,041
ఇచ్చోడ	32	2,65,117
ఇంద్రవెల్లి	28	2,95,770
జైనథ్	42	2,19,660
మావల	03	29,322
నార్నూర్	23	2,47,194
నేరడిగొండ	32	3,45,834
సిరికొండ	19	1,95,742
తలమడుగు	8	3,00,938
తాంసి	13	1,27,012
ఉట్నూర్	37	3,97,656

సిద్ధమవుతున్న నర్సరీలు

జిల్లాలో నిర్దేశిత లక్ష్యానికనుగుణంగా మొక్కలను సరఫరా చేసేందుకు ప్రతీ గ్రామంలో నర్సరీలను ఏర్పాటు చేస్తున్నారు. పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో మొక్కల పెంపకానికనుగుణంగా చర్యలు చేపడుతున్నారు. ఇప్పటికే అన్ని గ్రామాల్లోని నర్సరీల్లో నల్లమట్టిని తీసుకురావడంతో పాటు మట్టిని సంచుల్లో నింపే ప్రక్రియ కూడా పూర్తి చేశారు. హరితహారంలో భాగంగా వేప, మద్రి, రావి, చింత వృక్షాలతో పాటు గులాబీ, మల్లె, మందార, చామంతి వంటి పూల మొక్కలు, జామ, సీతాఫలం, అల్లనేరేడు వంటి పండ్ల మొక్కలను అందించేలా ప్రణాళిక సిద్ధం చేశారు. త్వరలోనే విత్తనాలను నాటేలా కసరత్తు చేస్తున్నారు. గ్రామ పంచాయతీ కార్యదర్శుల పర్యవేక్షణలో నిర్వహించే నర్సరీలకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద నిధులు చెల్లించనున్నారు. అయితే గతేడాదికి సంబంధించి మట్టి, విత్తనాలకు సంబంధించిన డబ్బులు రాలేదని పంచాయతీ కార్యదర్శులు చెబుతున్నారు. సకాలంలో బిల్లులు విడుదల కాకపోవడంతో నర్సరీల నిర్వహణ ఇబ్బందిగా మారుతుందని వాపోతున్నారు. ఆ నిధులు త్వరలో విడుదల చేస్తే కూలీలకు ప్రయోజనంతో పాటు నర్సరీల నిర్వహణ సులభంగా మారుతుందని ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

నర్సరీలు సిద్ధమవుతున్నాయి

ఏటా వర్షాకాలంలో చేపట్టే హరితహారంలో భాగంగా ఈ ఏడాది 40లక్షల మొక్కలు నాటేలా కార్యాచరణ సిద్ధం చేశాం. ఈ మేరకు మొక్కలు సరఫరా చేసేందుకు వీలుగా అన్ని గ్రామాల్లో నర్సరీలను జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద ఏర్పాటు చేశాం. ఇప్పటికే బ్యాగుల్లో మట్టి నింపే పనులు పూర్తయ్యాయి. లక్ష్యానికనుగుణంగా మొక్కలను సరఫరా చేసేందుకు వీలుగా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం.

– జి.సాయన్న, డీఆర్డీవో

కొత్త కానిస్టేబుళ్లకు నియామక పత్రాలు

- జిల్లా నుంచి 348 మంది పోలీసులు
- ఈనెలాఖరు నుంచి శిక్షణలో..
- నూతన కానిస్టేబుళ్లలో ఆనందం

ఆదిలాబాద్‌టౌన్: కానిస్టేబుల్ అభ్యర్థులకు ప్రభుత్వం ఎట్టకేలకు నియామక పత్రాలను అందజేసింది. గత ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసి ప్రిలిమినరీ, మెయిన్స్, దేహదారుఢ్య పరీక్షలు, సర్టిఫికెట్ల పరిశీలన పూర్తి చేసుకున్న వారు కొద్ది నెలలుగా నియామక ఉత్తర్వుల కోసం ఎదురుచూస్తున్నారు. ఇందులో భాగంగా కొత్త కానిస్టేబుల్ అభ్యర్థులకు సీఎం రేవంత్ రెడ్డి బుధవారం హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో నియామక పత్రాలు అందజేశారు. దీంతో అభ్యర్థుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. వీరికి ఈ నెల చివరి వారం నుంచి శిక్షణ ఇచ్చేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. అనంతరం పోస్టింగ్ కల్పించనున్నారు.

జిల్లాలో 348 మందికి..

జిల్లా నుంచి 364 మంది అభ్యర్థులు కానిస్టేబుల్ పరీక్షల్లో ఉత్తీర్ణులై కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపికయ్యారు. ఇందులో 16 మంది అభ్యర్థులు వివిధ పరీక్షల్లో అర్హత సాధించలేకపోయారు. మిగతా 348 మంది అభ్యర్థులకు ప్రభుత్వం నియామక పత్రాలు అందించింది. వీరందరిని పోలీసు శాఖ ఏడు బస్సుల్లో బుధవారం ఉదయం హైదరాబాద్‌కు తరలించారు. సాయంత్రం సీఎం రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రుల చేతుల మీదుగా నియామక పత్రాలు పొందారు. వీరిలో 152 మంది సివిల్ కానిస్టేబుళ్లు, 83 ఏఆర్ కానిస్టేబుళ్లు, 96 మంది టీఎస్ఎస్పీ, ఇద్దరు ఐటీ అండ్‌సీ, ఆరుగురు ఎక్సైజ్ కానిస్టేబుళ్లు, ముగ్గురు జైల్ వార్డెన్‌లు, 14 మంది ఫైర్ శాఖలో కానిస్టేబుళ్లుగా నియామక పత్రాలు అందుకున్నారు.

త్వరలో శిక్షణ..

నియామక పత్రాలు అందుకున్న కానిస్టేబుళ్లకు ఈనెల 18 నుంచి శిక్షణ కల్పించే అవకాశాలు ఉన్నాయని పోలీసు అధికారులు చెబుతున్నారు. అయితే ఇందుకు సంబంధించి ఎలాంటి ఉత్తర్వులు రాలేదు. ఈనెలాఖరు వరకు శిక్షణ ప్రారంభించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

ప్రధాని చొరవతో భవ్య రామమందిర నిర్మాణం



భక్తుల ప్రత్యేక బస్సును ప్రారంభిస్తున్న ఆదినాథ్

- బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆదినాథ్

ఆదిలాబాద్: ప్రధాని నరేంద్ర మోదీ ప్రత్యేక చొరవతో అయోధ్యలో భవ్య శ్రీరామ మందిర నిర్మాణం కల సాకారం అయిందని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వకులాభరణం ఆదినాథ్ అన్నారు. శ్రీరామ జన్మభూమి దర్శన్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా అయోధ్యకు బయలుదేరుతున్న బీజేపీ శ్రేణులు, శ్రీరామ భక్తుల ప్రత్యేక బస్సులను జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అయోధ్య శ్రీ బాలరాముని దర్శించుకునేందుకు ప్రపంచం నలుమూలల నుంచి భక్తులు తరలివస్తున్నారన్నారు. అయోధ్య నగరి విశిష్టతను దేశవ్యాప్తంగా మరింతగా ఇనుమడింపజేయాలనే ఉద్దేశంతో అయోధ్య దర్శన్ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందన్నారు. ఇందులో భాగంగా ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధి నుంచి 1,344 మంది అయోధ్య దర్శనానికి వెళ్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ప్రవీణ్, వేదవ్యాస్, శ్రీలేఖ, మనోజ్, రాము తదితరులు ఉన్నారు.

28న సేవాలాల్ జయంతి వేడుకలు



మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్ రాజ్

- ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలి
- కలెక్టర్ రాహుల్ రాజ్

కైలాస్‌నగర్: ఈనెల 28న సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలకు ఘనంగా నిర్వహించేలా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆయా శాఖల అధికారులు, బంజారా కమిటీ సభ్యులతో వేడుకల నిర్వహణపై బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. సంత్ సేవాలాల్ జయంతి వేడుకల నిర్వహణకు గాను సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు చేపట్టాలన్నారు. పారిశుధ్య కార్యక్రమాలు, తాగునీరు, మొబైల్ టాయిలెట్, బస్సుల ఏర్పాటు చేయాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. శాంతి భద్రతలు, వాహన పార్కింగ్ ఏర్పాట్లను పోలీస్ యంత్రాంగం నిర్వహించాలన్నారు. కరెంట్ సరఫరాలో ఎలాంటి అంతరాయం కలుగకుండా ముందస్తు ఏర్పాట్లు చేపట్టాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బు గుప్తా, ఆర్డీవో స్రవంతి, మైనారిటీ సంక్షేమ అధికారి రమేశ్ రాథోడ్, వివిధ శాఖల అధికారులు, బంజారా ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

- మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మికుల ఆందోళన



కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

కైలాస్‌నగర్: మున్సిపల్ కార్మికుల పెండింగ్ వేతనాలు వెంటనే విడుదల చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎస్.విలాస్ డిమాండ్ చేశారు. మున్సిపల్ ఎంప్లాయీస్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికుల డిసెంబర్, జనవరి వేతనాలు వెంటనే చెల్లించాలన్నారు. పీఎఫ్ డబ్బులు 2023 ఏప్రిల్ నుంచి నవంబర్ వరకు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. చైర్మన్ జోగు ప్రేమేందర్, కమిషనర్ శైలజ కార్మికుల వద్దకు వచ్చి డిసెంబర్– 2023 వేతనం వెంటనే చెల్లిస్తామన్నారు. కార్యక్రమంలో సంఘ బాధ్యులు రాములు, రాజు, కాంతారావు, గణపతి, నాగరాజు,శ్రీను తదితరులు పాల్గొన్నారు.

జ్ఞానాన్ని ప్రసాదించు తల్లీ..

- భక్తులతో నిండిన బాసర
- అర్ధరాత్రి నుంచే క్యూలైన్లు
- చదువులతల్లి దర్శనం కోసం బారులు
- చిన్నారులకు అక్షరాభ్యాసాలు
- ఘనంగా వసంతపంచమి వేడుకలు
- అసౌకర్యాలతో భక్తులకు అవస్థలు



అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న ముధోల్ ఎమ్మెల్యే రామారావుపటేల్



ఆలయంలో బారులు తీరిన భక్తులు

భైంసా: 'శరదిందు సమాకారే పరబ్రహ్మ స్వరూపిణి! వాసరా పీఠనిలయే సరస్వతీ నమోస్తుతే!!'.. అని ఆ బాసర సరస్వతమ్మను కొలుస్తూ.. 'చదువులతల్లీ చల్లంగా చూడమ్మా.. మా పిల్లలకు విద్యాబుద్ధులు, జ్ఞానాన్ని ప్రసాదించు తల్లీ..' అంటూ రెండుచేతులెత్తి మొక్కారు. పవిత్ర గోదావరితీరంలో వ్యాసమహర్షి చేతుల్లో ప్రాణప్రతిష్ఠ పొందిన జ్ఞానసరస్వతీమాత జన్మదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వసంతపంచమి పర్వదినం పురస్కరించుకుని బుధవారం బాసర భక్తజన సంద్రమైంది. రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక ప్రాంతాల నుంచి అశేషంగా తరలివచ్చిన భక్తజనవాహినితో చదువులమ్మ పులకించిపోయింది.

వేకువజాము నుంచే..

వసంతపంచమి పర్వదినాన తెల్లవారుజామున 2గంటల నుంచే జ్ఞానసరస్వతీమాత ఆలయంలో ప్రత్యేక పూజలు ప్రారంభమయ్యాయి. ముందుగా అమ్మవారికి అభిషేక సేవతో ఉత్సవం ప్రారంభమైంది. ఆలయ అర్చకులు, వేదపండితులు పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులు మంగళవారం అర్ధరాత్రి నుంచే గోదావరిలో స్నానాలు ఆచరించారు. గోదావరి స్నానఘట్టాలు సైతం భక్తులతో నిండిపోయాయి. అక్కడి నుంచి ఆలయానికి చేరుకుని అమ్మవారి దర్శనానికి, చిన్నారుల అక్షరాభ్యాసానికి వేకువజామున 4గంటల నుంచే క్యూలైన్‌లలో నిల్చున్నారు. దర్శనానికి కనీసం 4గంటల సమయం పట్టింది. మధ్యాహ్నం చండీ హోమం, వేద పారాయణ పూజలు నిర్వహించారు. చిన్నారులకు అక్షరాభ్యాసాలు, అభిషేక పూజలు భారీగా జరిగాయి.

అమ్మవారికి పట్టువస్త్రాలు..

తెల్లవారుజామున అమ్మవారికి నిర్వహించిన అభిషేక పూజలో స్థానిక ఎమ్మెల్యే పవార్ రామారావుపటేల్ పాల్గొన్నారు. ఆ తర్వాత ఉదయం 8 గంటలకు ఎంపీ సోయం బాపూరావు, ఎమ్మెల్యే రామారావు పటేల్, ఎమ్మెల్సీ దండె విఠల్, మాజీ ఎంపీ రమేశ్ రాథోడ్ తదితరులు కలిసి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఏటా దేవాదాయశాఖ మంత్రి హోదాలో అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించేవారు.ఈసారి వసంత పంచమి వేడుకలకు దేవాదాయ శాఖ మంత్రి కొండాసురేఖ రాలేకపోయారు.

అవే సమస్యలు.. తప్పని అవస్థలు

వసంత పంచమికి వచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేసినా అవి సరిపోలేదు. భక్తుల క్యూలైన్ దేవాలయ అతిథి గృహాలు దాటి ప్రధాన రోడ్డు వరకూ చేరింది. చిన్నారులు, వృద్ధులు గంటల తరబడి క్యూలో వేచి ఉండలేక నానాఅవస్థలు పడ్డారు. గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు కాలినడకన ఆలయానికి చేరుకున్నారు. అమ్మవారి దర్శనం చేసుకునేందుకు మాత్రం ఇబ్బందులు పడ్డారు. దూరప్రాంత భక్తులు ఒక్కరోజు ముందుగానే ఆలయానికి చేరుకున్నారు. రాత్రిపూట వసతి గదులు దొరకక ఆరుబయటే చలి, దోమల్లో నిద్రించాల్సి వచ్చింది.

క్షేత్ర దర్శనం..

దూరప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారి దర్శనంతో పాటు బాసరను చుట్టివచ్చారు. గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు పడవలో ప్రయాణించారు. వ్యాసమహర్షి గుహ వద్ద దర్శనానికి భక్తులు వరుసలు కట్టారు. బస్టాండ్ వద్ద ఉన్న వేదవతి శిలను రాళ్లతో కొట్టి అందులో నుంచి వచ్చే స్వరాలను ఆస్వాదించారు. పలువురు భక్తులు పాదయాత్రగా బాసరకు చేరుకోవడం కనిపించింది. రోజంతా ఆలయంలో అమ్మవారిని స్మరిస్తూ భజనలు చేస్తూ ఆధ్యాత్మిక ప్రసంగాలు కొనసాగించారు. వసంతపంచమి సందర్భంగా బాసర ఆలయం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. ఆలయ గర్భగుడిని పూలతో అందంగా అలంకరించారు. ప్రాంగణాన్ని విద్యుత్‌దీపాలతో ముస్తాబు చేశారు. ప్రధాన ద్వారం వద్ద స్వాగత తోరణాలు ఏర్పాటు చేశారు.

ఉదయం నుంచి రాత్రి వరకు...

బాసర ఆలయంలో బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తుల తాకిడి కనిపించింది. గతంతో పోలిస్తే ఈసారి భారీగా భక్తులు తరలివచ్చారు. దూరప్రాంతాల నుంచి రైలుమార్గంలో చేరుకున్నారు. నిజామాబాద్, భైంసారూట్‌లలో వచ్చే బస్సులు భక్తులతో కిక్కిరిసిపోయాయి. ప్రత్యేక వాహనాలను పోలీస్‌స్టేషన్ సమీపంలో, శాంకరీ ముందు స్థలంలో నిలిపివేశారు. వసంత పంచమి సందర్భంగా పెద్ద సంఖ్యలో వచ్చిన భక్తులతో వ్యాపారులకు చేతినిండా గిరాకీ దొరికింది. హోటళ్లు, టీకొట్లు, ఫలహారశాలలు భక్తులతో నిండిపోయాయి. అమ్మవారి ప్రసాదాల కౌంటర్ వద్ద గంటల తరబడి నిలబడాల్సి వచ్చింది.

బాధ్యతలు స్వీకరణ

కైలాస్‌నగర్: జిల్లాకు కొత్తగా నియామకమైన వివిధ శాఖల అధికారులు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. జెడ్పీ సీఈఓగా టీడీ.రత్నమాల, డిప్యూటీ సీఈవో ఎం.కలిందిని, డీఆర్డీవోగా జి.సాయన్న, డీఆర్డీవో ఏపీడీలుగా సీహెచ్.కుటుంబరావు, బోనగిరి శ్రీనివాస్, జిల్లా పంచాయతీ అధికారిగా శ్రీరాంబట్ల శ్రీలత, ఆదిలాబాద్, ఉట్నూర్ డివిజనల్ పంచాయతీ అధికారులుగా ఎస్.ఫణిందర్‌రావు, ప్రభాకర్ రావు తమ కార్యాలయ చాంబర్లలో బాధ్యతలు స్వీకరించారు. వారికి ఆయా కార్యాలయాల అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పుష్పగుచ్ఛాలు, పూల మొక్కలు అందజేసి స్వాగతం పలికారు. శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జిల్లా ఉన్నతాధికారులు కలెక్టర్ రాహుల్ రాజ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న జెడ్పీ సీఈవో రత్నమాల



జెడ్పీ డిప్యూటీ సీఈవో కలిందిని



డీఆర్డీవో సాయన్న

క్లుప్తంగా

జాతీయస్థాయిలో గురుకుల విద్యార్థుల హవా



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

నార్నూర్: మండల కేంద్రంలోని ఏకలవ్య మోడల్ గురుకుల పాఠశాల విద్యార్థులు జాతీయస్థాయి హ్యాండ్ బాల్ పోటీల్లో సత్తా చాటారు. రాజస్తాన్ చిత్తోర్ఘర్ నిర్వహించిన సబ్‌జూనియర్ హ్యాండ్‌బాల్ పోటీల్లో స్వప్న 9వ తరగతి, శశాంత్ ఏడవ తరగతి విద్యార్థులు సత్తా చాటడంతో బుధవారం ప్రిన్సిపాల్ ఉపేందర్, పీఈటీ అనూషలు విద్యార్థులను అభినందించారు. చదువుతోపాటు క్రీడల్లో రాణిస్తే బంగారు భవిష్యత్ ఉంటుందన్నారు. క్రీడలు శారీరక దారుఢ్యాలను పెంచుతుందన్నారు. ప్రతిఒక్కరూ క్రీడల్లో రాణించేలా విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీయాలని ఆయన సూచించారు.

రాష్ట్రస్థాయికి ఎంపికైన రాయిగూడ విద్యార్థి

సిరికొండ: ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో ఇంగ్లిష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన స్పెల్ విజార్డ్ కాంపిటీషన్‌లో మండలంలోని రాయిగూడ ఆశ్రమ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న జి.అవిష్‌కుమార్ ప్రథమ స్థానంలో నిలిచాడు. దీంతో జిల్లా నుంచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాడు. ఈ నెల 26 హైదరాబాద్‌లో జరిగే స్పెల్ విజార్డ్‌లో పాల్గొననున్నాడు. దీంతో అవిష్‌కుమార్‌ను పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

నేటి నుంచి బుడుందేవు జాతర



శ్యాంపూర్‌లోని బుడుందేవు ఆలయం

ఉట్నూర్‌రూరల్: కెస్లాపూర్ నాగోబా జాతర అనంతరం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించే బుడుందేవు జాతర నేటి నుంచి ప్రారంభం కానుంది. కేస్లాపూర్‌లో పూజల అనంతరం గురువారం మెస్రం వంశీయులు ఉట్నూర్ మండలంలోని శ్యాంపూర్‌కు చేరుకుని శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. యేటా బుడుందేవుకు ప్రత్యేక పూజల అనంతరం జాతర ప్రారంభం కానుంది.

రాత్రి వేళల్లో కలప అక్రమ రవాణా



ట్రాక్టర్‌లో తరలిస్తున్న తెల్లమద్ది, టేకు కర్రలు

నర్సాపూర్(జి): మండలంలోని పెద్ద కాలువ రిజర్వ్ ఫారెస్ట్ నుంచి బుధవారం రాత్రి ట్రాక్టర్‌లో అక్రమంగా తెల్లమద్ది, టేకు చెట్లను నరికి తరలించుకుపోతున్నారు. రిజర్వ్ ఫారెస్ట్ నుంచి యథేచ్ఛగా యంత్రాల సాయంతో కలపను నరికివేస్తున్నారు. ఫారెస్ట్ అధికారులు పట్టించుకోకపోవడంతో కలప స్మగ్లర్లు రెచ్చిపోతున్నారు. ఈ విషయమై ఫారెస్ట్ ఫ్లయింగ్ స్క్వాడ్ రమేష్‌రావును వివరణ కోరగా రిజర్వ్ ఫారెస్ట్ నుంచి చెట్లను నరికివేసిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. స్థానికంగా అటవీశాఖ అధికారులు లేకపోవడంతో కలప తరలిపోతోందని, సంబంధిత శాఖ అధికారులు కాపాడాలని మండల వాసులు కోరుతున్నారు.



అక్షరాభ్యాసం కోసం పిల్లలతో దూసుకెళ్లిన తల్లిదండ్రులు



అక్షరాభ్యాస మండపంలో పిల్లలతో



బాసర రైల్వే స్టేషన్లో సేదతీరుతున్న భక్తులు



వాగ్వాదానికి దిగిన మహిళలు

చదువులమ్మ చెంత.. సమస్యల చింత



క్యూలైన్లో నిల్చోలేక పిల్లలతో కూర్చున్న తల్లులు



పోలీసులతో భక్తుల వాగ్వాదం



నిరసించిపోయి పడుకున్న తండ్రి

చదువులతల్లి సరస్వతి అమ్మవారు కొలువైన బాసరలో భక్తులను సమస్యలు వెంటాడాయి. ప్రధానంగా ఉత్సవాల సందర్భంగా భక్తుల పాట్లు అన్నీ ఇన్నీ కావు. బుధవారం వసంత పంచమి సందర్భంగా వేలాదిగా వచ్చిన భక్తులకు పాత సమస్యలే దర్శనమిచ్చాయి. భక్తుల సంఖ్య అధికంగా ఉంటుందని తెలిసినప్పటికీ అధికారులు మాత్రం తాత్కాలిక పనులపైనే దృష్టిసారించారు. ప్రధానంగా వంద పడకల గదికి సంబంధించిన పనులు పూర్తి కాకపోవడంతో భక్తులకు రూములు లేక చిన్న పిల్లలతో రోడ్డు పక్కనే పడుకున్నారు. మహిళలు టాయిలెట్స్ సౌకర్యం లేక ఇబ్బంది పడ్డారు. క్యూలైన్‌లో తాగునీటికి చిన్నారులకు అవస్థలు తప్పలేదు. పలువురు భక్తులు క్యూలైన్‌లో సొమ్మసిల్లి పడిపోయారు. రాత్రి రెండు గంటల నుంచి భక్తులు అక్షరాభ్యాసాల కోసం చిన్నపిల్లలతో క్యూలైన్‌లో పడుకున్నారు. ఏర్పాట్లపై భక్తులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్

‘కిసాన్ వాణి’కి 20 ఏళ్లు



ఆదిలాబాద్ ఆకాశవాణి కేంద్రం

- రైతులకు చేయూతగా రేడియో ప్రసార కార్యక్రమం
- నేడు రేడియో కిసాన్ దివస్

ఆదిలాబాద్: అధునాతన సాంకేతిక యుగంలోనూ అన్నదాతలకు ఆకాశవాణి కార్యక్రమాలు ఎంతో విజ్ఞానాన్ని అందజేస్తున్నాయి. సాగుబడిలో అవసరమైన మెలకువల్ని విత్తేటప్పటి నుంచి పంట మార్కెట్ చేరేవరకు అవసరమైన సూచనలు సలహాలను శాస్త్రవేత్తలు, వ్యవసాయ నిపుణులతో అందిస్తూ వారి సేద్యాన్ని సులభతరం చేస్తోంది. ఆకాశవాణి ద్వారా కర్షకులకు వ్యవసాయంలో ఎంతో విలువైన సమాచారాన్ని రెండు దశాబ్దాలుగా అందిస్తుండడం విశేషం. ఆకాశవాణిలో వ్యవసాయదారులకు ఎంతో ఉపయుక్తమైన కిసాన్ వాణి కార్యక్రమం ప్రారంభమై 20 ఏళ్లు అవుతుండడం విశేషం. 2004 ఫిబ్రవరి 15వ తేదీన ప్రారంభమైన ఈ కార్యక్రమం నేటితో 20ఏళ్ళను పూర్తి చేసుకోనుంది.

సైరికుల సహాయకారిగా..

వినోదం, విజ్ఞానం, సమాచారం అనే మూడు రంగాలను ప్రాతిపదికగా చేసుకొని రేడియో మాధ్యమమైన ఆకాశవాణి శ్రోతలను అలరిస్తోంది. ముఖ్యంగా రైతులకు వ్యవసాయంలో మెలకువలను తెలియజేయాలనే ఉద్దేశంతో వినూత్నమైన కిసాన్ వాణి కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. కేంద్ర వ్యవసాయ రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ సౌజన్యంతో ఈ కార్యక్రమం ప్రారంభమైంది. కిసాన్ వాణి ద్వారా సాగులో అవసరమైన అవగాహన కార్యక్రమాలు, రైతులకు అవసరమైన శాస్త్రీయమైన సూచనలు, అధునాతన పద్ధతులు, కచ్చితమైన సమాచారం ప్రసారం చేస్తోంది. అదేవిధంగా ఆదర్శ రైతులు, వారు చేసే సాగు పద్ధతులు, పంట దిగుబడి, లాభసాటి సేద్యం, నీటి యాజమాన్య పద్ధతులు, రుణాలు, ఎరువులు– వాటి వినియోగం వంటి వాటిపై ప్రత్యేక శ్రద్ధ చూపుతోంది. అదేవిధంగా పంట సమయంలో చీడపీడల నివారణ, పురుగు మందుల వాడకం సేంద్రియ ఎరువుల ఆవశ్యకత వంటి అంశాలను గురించి వ్యవసాయ శాస్త్రవేత్తలతో రైతులకు విలువైన సలహాలను అందజేసే ప్రయత్నం చేస్తోంది.



రైతులతో ముచ్చటిస్తున్న వ్యాఖ్యాతలు

కిసాన్ వాణి సమయసారిని ఇదే..

కిసాన్ వాణి ప్రసార కార్యక్రమం ఆకాశవాణి ద్వారా ప్రతి మంగళ, గురు, శనివారాల్లో ప్రసారమవుతుంది. ఆయా రోజుల్లో శాస్త్రవేత్తలు వ్యవసాయ నిబంధనలతో ప్రత్యక్షంగా 'ఫోన్ ఇన్' కార్యక్రమాన్ని సైతం ఏర్పాటు చేస్తుండడంతో ఈ కార్యక్రమం రైతుల ఆదరణ పొందింది.

నేడు రేడియో కిసాన్ దివస్ కార్యక్రమం..



ఆదిలాబాద్ ఆకాశవాణి కేంద్రం ద్వారా కిసాన్ వాణి కార్యక్రమంలో భాగంగా ఎన్నో వినూత్నమైన కార్యక్రమాలను నిర్వహిస్తున్నాం. రైతులకు అవసరమైనటువంటి అన్ని విధాలా సలహాలు సూచనలు ఇచ్చే ప్రయత్నం చేస్తున్నాం. అదేవిధంగా రైతు అంతరంగం అనే శీర్షికను ప్రసారం చేస్తూ మిగతా రైతుల్లో స్ఫూర్తిని నింపేలా కృషి చేస్తున్నాం. అధికారుల శాస్త్రవేత్తలతో మాట్లాడించాలని కాకుండా మేలైన సాగు పద్ధతులు పాటించి మంచి దిగుబడులు సాధించేలా మా వంతుగా శ్రమిస్తున్నాం. ఫిబ్రవరి 15న జిల్లా కేంద్రంలోని ఆకాశవాణిలో రేడియో కిసాన్ దివస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం.

– రామేశ్వర్ కేంద్రే, ముఖ్య కార్యక్రమాధికారి, ఆదిలాబాద్ ఆకాశవాణి

గెలుపే లక్ష్యంగా కృషి చేయాలి



మాట్లాడుతున్న ఎంపీ సోయం బాపురావు



నిర్మల్‌చైన్‌గేట్: మాట్లాడుతున్న ఎంపీ

భైంసాటౌన్: రానున్న లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఆదిలాబాద్ ఎంపీ స్థానం గెలుపే లక్ష్యంగా కృషి చేయాలని ఎంపీ సోయం బాపూరావు అన్నారు. పట్టణంలోని ఎస్ఎస్ కాటన్ ఫ్యాక్టరీలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు అంజుకుమార్ రెడ్డి అధ్యక్షతన బుధవారం నిర్వహించిన అసెంబ్లీ ప్రవాస్ యోజన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఈనెల 20 నుంచి బాసర నుంచి ప్రారంభం కానున్న బస్సు యాత్రను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం ఎమ్మెల్యే రామారావుపటేల్ మాట్లాడుతూ.. లోక్‌సభ ఎన్నికల్లో ముథోల్ నియోజకవర్గం నుంచి లక్షా 50వేల పైచిలుకు ఓట్లతో గెలిపించుకుంటామని, ప్రధాని మోదీకి ఆదిలాబాద్ ఎంపీ స్థానం కానుకగా ఇస్తామన్నారు. జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ.. కార్యకర్తలందరూ సరళ్, నమో యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పార్లమెంట్ కన్వీనర్ అయ్యన్నగారి భూమయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నారాయణ్‌రెడ్డి, నాయకులు రావుల రాంనాథ్, అసెంబ్లీ కన్వీనర్ తాడేవార్ సాయినాథ్, పడిపెల్లి గంగాధర్, ఎంపీపీ అబ్దుల్ రజాక్, రమేశ్, భీంరావు ఉన్నారు.

నిర్మల్‌చైన్‌గేట్: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ప్రతీ కార్యకర్త గెలుపే లక్ష్యంగా పనిచేయాలని ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపూరావు అన్నారు. అసెంబ్లీ ప్రవాస్ యోజన కార్యక్రమంలో భాగంగా బుధవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈనెల 20న బాసర జ్ఞాన సరస్వతి మందిరంలో పూజలు చేసి బస్సు యాత్ర ప్రారంభిస్తామన్నారు. అనంతరం నిర్మల్, బోథ్, ఆదిలాబాద్, ఖానాపూర్, ఇంద్రవెల్లి, ఉట్నూర్, జైనూర్, కెరమెరి, ఆసిఫాబాద్, కాగజ్‌నగర్, మంచిర్యాల్ మీదుగా యాత్ర కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో నిర్మల్ జిల్లా అధ్యక్షుడు అంజుకుమార్‌రెడ్డి, ఆదిలాబాద్ పార్లమెంట్ కన్వీనర్ అయ్యాన్నగారి భూమయ్య, రాష్ట్ర నాయకులు రావుల రామ్నాథ్, జిల్లా ప్రధాన కార్యదర్శులు సామ రాజేశ్వర్‌రెడ్డి, మెడిసెమ్మె రాజు, ఉపాధ్యక్షుడు కమల్ నయన్, అసెంబ్లీ కన్వీనర్ గాదె విలాస్, పట్టణ అధ్యక్షుడు సాదం అరవింద్ పాల్గొన్నారు.

అధికారులు అంకితభావంతో పనిచేయాలి

- ఐటీడీఏ పీవో ఖుష్బూ

నార్నూర్: గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి జరగాలంటే అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఐటీడీఏ పీవో ఖుష్బూ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో నీతి ఆయోగ్ కార్యక్రమంలో భాగంగా సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. శాఖల వారీగా అభివృద్ధి, చేపట్టాల్సిన పనులు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతంలో గ్రూపుల ద్వారా దాల్‌మిల్ ఏర్పాటు చేయడానికి నిధులు మంజూరు చేస్తామన్నారు. యాక్టివ్‌గా ఉన్న స్వయం సహాయక సంఘం ఉంటే ముందుకు రావాలన్నారు. పాఠశాలల వారీగా సమస్యలను ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. నీతి అయోగ్‌లో భాగంగా చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. అలాగే మండల కేంద్రంలోని సీహెచ్‌సీని సందర్శించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మండల కేంద్రంతోపాటు మాన్కాపూర్ బాలికల ఆశ్రమ పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థులకు అవసరమైన ప్రత్యేక సౌకర్యాలు కల్పిస్తామన్నారు. పదో తరగతి పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో విద్య బోధనపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఐటీడీఏ డీడీ దిలీప్‌కుమార్, ఏటీడీవో క్రాంతికుమార్, తహసీల్దార్ జాడీ రాజలింగం, ఎంపీడీవో జవహర్, సీడీపీవో శారద, ఎంఈవో రాపల్లి ఆశన్న, ఆర్‌డబ్ల్యూఎస్ సుభాని ఉన్నారు.



పల్లెప్రకృతి వనాన్ని పరిశీలిస్తున్న ఐటీడీఏ పీవో

అత్తారింటికి వెళ్తుండగా రోడ్డు ప్రమాదం..

- తండ్రి మృతి, కొడుకుకు గాయాలు

నేరడిగొండ: అత్తారింటికి వెళ్తూ రోడ్డు ప్రమాదంలో తండ్రి మృతిచెందగా కుమారుడికి గాయాలైన సంఘటన ధనోర జాతీయ రహదారిపై మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. భీంపూర్ మండలం పిప్పల్‌కోటి గ్రామానికి చెందిన జటాల అశోక్(37) కుమారుడు విశాల్‌తో కలిసి మంగళవారం రాత్రి బైక్‌పై ఖానాపూర్ మండలంలోని సత్తెన్నపల్లి గ్రామానికి బయలుదేరాడు. ధనోర జాతీయ రహదారి వద్ద వెనుక నుంచి మరో బైక్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అశోక్ సంఘటన స్థలంలోనే మృతిచెందాడు. కొడుకు విశాల్‌కు తీవ్ర గాయాలయ్యాయి. భార్య చిన్నకుమారుడితో మూడు రోజుల క్రితమే పుట్టింటికి వెళ్లింది. భర్త, పెద్ద కుమారుడు బైక్‌పై వెళ్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. మృతదేహాన్ని ఆదిలాబాద్ రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. బుధవారం పిప్పల్‌కోటిలో అంత్యక్రియలు నిర్వహించారు. అశోక్ రిమ్స్ ఆస్పత్రిలో కాంట్రాక్ట్ పద్ధతిలో అటెండర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. పెద్దదిక్కు కోల్పోవడంతో ఆ కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది.



అశోక్ (ఫైల్)

టేకు దుంగలు పట్టివేత

బెల్లంపల్లి: ఓ కారులో అక్రమంగా తరలిస్తున్న టేకు దుంగలను బుధవారం బెల్లంపల్లి అటవీశాఖ అధికారులు పట్టుకున్నారు. బెల్లంపల్లి ఎఫ్ఆర్‌వో సుభాష్ వివరాల ప్రకారం... కుమురంభీం ఆసిఫాబాద్ ప్రాంతం నుంచి ఓ కారులో ఎలాంటి అనుమతి లేకుండా టేకు దుంగలను బెల్లంపల్లికి తీసుకువస్తున్నట్లు అటవీ అధికారులకు సమాచారం అందింది. వెంటనే స్పందించిన అటవీ అధికారులు బెల్లంపల్లి చేరువలో మాటు వేసి కలప రవాణా చేస్తున్న కారును పట్టుకున్నారు. కారులోని ఏడు టేకు దుంగలు ఉన్నట్లు గుర్తించగా వీటి విలువ రూ.35 వేల వరకు ఉంటుందని అధికారులు ప్రకటించారు. ఈ మేరకు కారును, టేకు దుంగలను స్వాధీనం చేసుకుని అటవీ రేంజ్ కార్యాలయానికి తీసుకెళ్లారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అటవీ అధికారులు తెలిపారు. ఈ దాడిలో డెప్యూటీ ఎఫ్ఆర్‌ఓ గౌరి శంకర్, ఎఫ్ఎస్ఓ శ్రీనివాస్ పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

చెన్నూర్‌రూరల్: మండలంలోని చింతలపల్లి గ్రామశివారులో అక్రమంగా మహా రాష్ట్రకు తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని బుధవారం ఎన్‌ఫోర్స్‌మెంట్, టాస్క్‌ఫోర్స్ అధికారులు పట్టుకున్నారు. రేషన్ బియ్యాన్ని మహారాష్ట్రకు తరలిస్తున్నారనే సమాచారం మేరకు అధికారులు దాడి చేసి వాహనాలను సీజ్ చేసినట్లు తెలిపారు. సుమారు 66క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని చెన్నూర్‌లోని వ్యవసాయ మార్కెట్‌కు తరలించారు. అలాగే బియ్యం తరలిస్తున్న రెండు వాహనాలను సీజ్ చేసి ఇద్దరిని అదుపులోకి తీసుకుకొని కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా సీఐ రవిందర్ మాట్లాడారు. మండలంలో రేషన్ బియ్యాన్ని డంపు చేసినా అక్రమ రవాణా చేసినా చట్ట పరంగా కేసులు నమోదు చేయడమే కాకుండా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

చెరువులో పడి బాలుడి మృతి



సాయికుమార్ (ఫైల్)

నిర్మల్‌రూరల్: మండలంలోని న్యూ పోచంపాడు గ్రామానికి చెందిన సంపంగి సాయికుమార్ (16) బుధవారం ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతిచెందినట్లు రూరల్ ఎస్సై చంద్రమోహన్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం ... గ్రామానికి చెందిన సాయికుమార్ తన గొర్రెలను మేపడానికి మామయ్య ముత్యంతో గ్రామ సమీపంలోని అక్కాపూర్ చెరువుకు వెళ్లాడు. కొన్ని గొర్రెలు నీటి కోసం చెరువులోకి వెళ్లగా వాటిని తీసుకువచ్చేందుకు సాయికుమార్ చెరువులో దిగాడు. వాటిని బయటకు తీసుకొని వస్తుండగా ప్రమాదవశాత్తు మునిగిపోయాడు. స్థానికులు గమనించి బయటకు తీసి ఆసుపత్రికి తరలించారు. వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు ప్రకటించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

తానూరు: పురుగుల మందుతాగి యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని భోసి గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. ఏఎస్సై నర్సింగ్ బాను వివరాల ప్రకారం.. మేకల గంగాధర్(34) ఈ నెల 12వ తేదీన భైంసాకు వెళ్తానని చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. బోల్సా శివారు ప్రాంతంలో పురుగుల మందు తాగాడు. బుధవారం అక్కడి వెళ్లిన కొంతమంది రైతులు మృతదేహాన్ని పరిశీలించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. పోలీసులు చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. తల్లి మేకల లక్ష్మిబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

ప్రాణం తీసిన వివాహేతర బంధం

మంచిర్యాలక్రైం/చెన్నూర్‌రూరల్: ఐదేళ్ల పాటు ఓ యువకుడు వివాహితతో సహజీవనం గడిపాడు. చివరకు సదరు వివాహిత చేతిలో దారుణంగా హత్యకు గురైన ఘటన బుధవారం వెలుగులోకి వచ్చింది. డీసీపీ సుధీర్ రాంనాథ్ కేకన్ విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించాడు. చెన్నూర్ మండలం పొన్నారం గ్రామానికి చెందిన రామగిరి మహేందర్(35)కు అదే గ్రామానికి చెందిన పద్మ (వివాహిత)తో ఐదేళ్లుగా వివాహేతర సంబంధం కొనసాగుతోంది. నాలుగు నెలల క్రితం పద్మ భర్త శేఖర్‌ను, ఇద్దరు పిల్లలను వదిలేసి మహేందర్‌తో వెళ్లిపోయింది. భర్త ఫిర్యాదు మేరకు చెన్నూర్ పోలీస్‌స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదైంది. కొంత కాలం తర్వాత మహేందర్, పద్మ ఆచూకీ లభించడంతో పోలీసులు వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు. అయినప్పటికీ మహేందర్‌తోనే ఉండేందుకు పద్మ అంగీకరించింది. నెలరోజుల క్రితం మహేందర్, పద్మల మధ్య గొడవ కావడంతో తల్లిగారి గ్రామమైన కమ్మరిపెల్లికి వెళ్లిపోయింది. ఈ నెల 13న పద్మ మహేందర్‌కు ఫోన్ చేసి ఇంటికి రావాలని కోరింది. దీంతో మహేందర్ తన స్నేహితులైన కడారి శేఖర్, జాలంపల్లి సాయిరాజ్‌తో కలిసి ఆ గ్రామానికి వెళ్లాడు. స్నేహితులను దూరంలోనే ఉంచి రాత్రి 12గంటలకు పద్మ ఇంట్లోకి వెళ్లాడు.

పథకం ప్రకారమే హత్య...

పథకం ప్రకారం మహేందర్‌ను ఇంటికి పిలిపించి హత్య చేయాలని పద్మ నిర్ణయించుకుంది. ఇంట్లోకి వెళ్లిన మహేందర్‌తో గొడవ మొదలు కావడంతో పద్మ, పద్మ భర్త శేఖర్, తండ్రి మొగిలి ఓదెలు, తల్లి సుగునక్క కర్రలతో దాడిచేసి హత్య చేశారు. ఆ తర్వాత అదే రాత్రి ఎడ్లబండిపై శవాన్ని అటవీ ప్రాంతానికి తీసుకెళ్లి కాల్చివేశారు. ఈ విషయాన్ని శేఖర్, సాయిరాజ్‌ల ద్వారా తెలుసుకున్న మహేందర్ సోదరుడు రవీందర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బుధవారం కమ్మరిపెల్లికి వెళ్లిన పోలీసులు పద్మ కుటుంబ సభ్యులను నిలదీయగా అసలు విషయం వెలుగు చూసింది.



వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ

24గంటల్లో హంతకులఅరెస్ట్..

మహేందర్ హత్య కేసును నమోదు చేసుకున్న చెన్నూర్ సీఐ రవీందర్, డీసీపీ రంగంలోకి దిగారు. అటవీ ప్రాంతంలో సగం కాలిపోయిన మహేందర్ మృతదేహాన్ని గుర్తించిన పోలీసులు చెన్నూర్‌కు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. హత్యకు పాల్పడినవారిని సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.